క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభం



మాక్లూర్: గుంజ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున నుంచే బ్రహ్మశ్రీ వడ్యాల కృష్ణబాబు శర్మ పర్యవేక్షణలో గ్రామ పొలి మేర నుంచి దేవతల విగ్రహాలను ఊరేగింపుగా మంగళహారతుల మధ్య అగ్నిప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం కూడా ఆలయంలో ప్రత్యేక పూజలుంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



వేల్పూర్: జాన్కంపేట్ గ్రామంలో కొరివి మహేష్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం దరఖాస్తుదారునికి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, కిశోర్‌గౌడ్, నరేశ్, ఆర్.చిన్నగంగారాం, జి.నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


అంబలి కేంద్రం ప్రారంభం



బాల్కొండ: కిసాన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చటానికి రెండు నెలలు ఉచితంగా అంబలి పంపిణీ చేయనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. క్లబ్ చైర్మన్ చాకులింగం, దినేష్, జీవన్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలి

ఆర్మూర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూముల వేలంపై ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా స్పందించారు. ఈ భూముల వేలాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ, వేల వన్యప్రాణులు(పర్యావరణ జీవులు) ప్రమాదంలో పడుతున్నాయని, ప్రభుత్వం పునరాలోచించాలని విన్నవించారు. భూముల వేలాన్ని ఉపసంహరించుకోకపోతే, హెచ్‌సీయూ విద్యార్థులతో కలిసి ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. సేవ్ హెచ్‌సీయూ అంటూ పోస్టు చేశారు.



ఎరుపెక్కిన మామిడి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్ర శివారులో పంట భూమిలో ఓ మామిడి చెట్టు అటుగా వెళ్లే వారిని ఆకర్షిస్తోంది. చిగురాకు ఎరుపు రంగులో ఉండటంతో మామిడి చెట్టు ఆ రంగులో కనిపిస్తోంది. దీంతో ఆ మార్గంలో వచ్చీపోయే వాళ్లు ఆ చెట్టు వైపు తదేకంగా చూస్తున్నారు.

నవీపేటలో ఆర్వోబీ కలేనా?

- రోజుకు 52 రైళ్ల రాకపోకలు
- తరచూ గేటు పడడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



నవీపేటలో గేటు పడటంతో ఆగిన వాహనాలు

నవీపేట: దూర ప్రాంతాల రాకపోకలను సులభతరం చేసిన రైలు మార్గం.. రహదారుల వెంబడి రాకపోకలు సాగించే ప్రయాణికులకు కొన్ని ప్రాంతాలలో ఇబ్బందులకు గురి చేస్తోంది. బాసర రహదారిపై నవీపేట మండల కేంద్రంలో ఉన్న రైల్వే గేటు తరచూ పడటంతో బాసరకు వెళ్లే భక్తులతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో నిర్దీత గడువులో గమ్యాన్ని చేరలేక అవస్థలు పడాల్సి వస్తోంది. నవీపేట రైల్వే స్టేషన్ మీదుగా 24 గంటలలో వివిధ రకాల 52 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. రైల్వే స్టేషన్ పక్కనే గల బాసర రహదారిపై రైల్వే గేటును ఏర్పాటు చేశారు. ప్రతి అరగంటకో సారి ఏదో ఒక రైలు రావడంతో తరచూ గేటు వేయాల్సి వస్తుంది. ఒక్క సారి గేటు పడిందంటే 10 నిమిషాలు ఆగాల్సిందే. క్రాసింగ్ ఉంటే మరో 10 నిమిషాలు ఆగాల్సి వస్తుంది.

ఆర్వోబీకి లభించని మోక్షం

బాసర రహదారిపై ఈ రైల్వే గేటు ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నవీపేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మించాలని గతంలో పలుమార్లు రైల్వే అధికారులు, ఎంపీలకు స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారు లు వినతులు సమర్పించారు. నిజామాబాద్‌లోని మాధవనగర్, నవీపేటలలో ఆర్వోబీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు చెప్పారు. మాధవనగర్ ఆర్వోబీకి నిధులు మంజూరై, పనులు కొనసాగుతున్నాయి. కానీ నవీపేట ఆర్‌వోబీకి మోక్షం లభించలేదు. ప్రతి శుక్ర, శనివారాలలో కొనసాగే వారాంతపు కూరగాయలు, మేకల సంతలకు అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ఈ గేటుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్కెట్ ప్రాంగణానికి సమీపంలో ఈ గేటు ఉండటంతో గేటు పడిన సమయంలో వాహనాలు అక్కడి వరకు వచ్చి ఆగిపోతున్నాయి. దీంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కొనసాగుతున్న ఆర్‌యూబీ పనులు..

ఇదే రైలు మార్గానికి ఇరువైపులా మండలంలోని ధర్మారం, ధర్యాపూర్, మహంతం, నాగేపూర్ గ్రామాల పరిధిలోని రైల్వేగేట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌యూబీ(రైల్వే అండర్ బ్రిడ్జి)లను నిర్మించాలని ప్రతిపాదించారు. నాగేపూర్ సమీపంలో ఆర్‌యూబీ పూర్తయింది. ధర్యాపూర్, ధర్మా రం, మహంతంలలో ఆర్‌యూబీలను నిర్మించేందుకు సిద్ధమయ్యారు.

ఆర్వోబీని నిర్మించాలి



నవీపేట రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీని నిర్మించాలి. రైళ్ల రాకపోకలతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో గేటు పడిన సమయంలో ఇబ్బందవుతుంది. ఆర్వోబీని నిర్మించాలని గతంలో అధికారులకు విన్నవించాం. కానీ ఇంత వరకు నిర్మాణంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

– కొండపురం సురేష్, ఆటో డ్రైవర్, నవీపేట

ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



వృత్తి రీత్యా ప్రతి రోజూ నవీపేట నుంచి నిజామాబాద్‌కు రాకపోకలు సాగిస్తాను. వెళ్లే సమయంలోనైనా..వచ్చే సమయంలోనైనా ఏదో ఒక సమయంలో గేటు పడుతుంది. ఒక్కోసారి రెండు సమయాల్లో గేటు పడుతుంది. గేటు పడితే 10 నుంచి 25 నిమిషాలు ఆగాల్సి వస్తుంది. చాలా ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.

– రాధా కిషన్, బీడీ కమీషన్ ఏజెంట్, నవీపేట

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బినోలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ మగ్గారి హన్మాండ్లు



రామన్నపేట్‌లో.. చైర్మన్ జాగీరపు మోహన్‌రెడ్డి

నవీపేట: బినోల గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు ప్రారంభించారు. వైస్ చైర్మన్ ఖాజా ఆశ మొద్దీన్, డైరెక్టర్లు విజయ్, ప్రదీప్‌రావ్, బాల్ రాజ్‌గౌడ్, గంగాధర్, సీఈవో మ్యాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో..

వేల్పూర్: రామన్నపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ జాగీరపు మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సొసైటీ వైస్ చైర్మన్ గడ్డం మల్లేష్, డైరెక్టర్లు గడ్డం మహిపాల్, శంకర్‌గౌడ్, నర్సయ్య, గంగాధర్, రాజేశ్వర్, వీడీసీ అధ్యక్షుడు గుమ్ముల కిషన్, సొసైటీ కార్యదర్శి రణవీర్ పాల్గొన్నారు.

బోనస్‌తో రైతులకు అదనపు ఆదాయం

రెంజల్(బోధన్): ప్రభుత్వ మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బోనస్ అందించడంతో అదనపు ఆదాయం వస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో దండిగుట్ట, కూనేపల్లి, రెంజల్, నీలా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. దూపల్లిలో విండో చైర్మన్ భూంరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు సాయరెడ్డి, జావీద్, ధనుంజయ్, ఏపీఎం చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



ముప్కాల్ మండల కేంద్రంలో పునరుజ్జీవన పంపు హౌజ్ రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్త

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ప్రతి గల్లీలో డంపింగ్ యార్డును తలపించేలా చెత్త పేరుకుపోయింది. ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేక పాలన సాగుతుంది. ప్రత్యేకాధికారులు పల్లెల్లో కనిపించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఇలాంటి సమస్య తలెత్తుతుందని స్థానికులు అంటున్నారు. చెత్తా సేకరణ కోసం ట్రాక్టర్‌లున్నాయి. కాని సకాలంలో రాకపోవడంతో గల్లీలోనే డంపింగ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించి చెత్త సేకరణ పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గల్లీలో పేరుకుపోయిన చెత్తను తొలిగించటానికి చర్యలు తీసుకుంటామని, అలాగే చెత్త బయట వేసే వారికి జరిమానాలు విధిస్తామని స్థానిక పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ హెచ్చరించారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



మెండోరా మండల కేంద్రంలో.. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ ముత్యం రెడ్డి



నందిపేటలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మామిడిపల్లి రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఆర్మూర్ కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి

జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు త్వరలో అందజేస్తుందని చెప్పారు. సన్నబియ్యం సరఫరా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక కార్యక్రమమని, సన్నబియ్యం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జాకోరాలో.. సొసైటీ చైర్మన్ దశరథ్



కమ్మర్‌పల్లిలో.. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య

పాపం మాజీ సర్పంచ్‌లు..

- మూడేళ్లుగా చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న వైనం
- బాల్కొండ నియోజకవర్గంలో మాజీలకు అందాల్సిన బిల్లులు రూ.5 కోట్ల పైమాటే

మోర్తాడ్(బాల్కొండ): ఉమ్మడి మోర్తాడ్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌కు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆయన చేసిన అప్పులకు వడ్డీ భారం పెరిగిపోయింది. అసలుతో సమానంగా వడ్డీ పెరగడం, చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆయనకు వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలం, తాను ఇష్టంగా కొనుక్కున్న కారును విక్రయించుకుని రూ.50 లక్షల అప్పులు తీర్చుకున్నాడు. ప్రభుత్వం నుంచి బిల్లు మంజూరైతే ఆయన ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది లేకుంటే అధోగతే. ఇది ఒక్క గ్రామ సర్పంచ్‌కు ఎదురైన దుస్థితే కాదు. నియోజకవర్గంలోని మెజార్టీ గ్రామాల సర్పంచ్‌ల పరిస్థితి ఇదే. బాల్కొండ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 87 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 87 గ్రామాల సర్పంచ్‌లకు సంబంధించి రూ.5 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాల బిల్లులు గత సంవత్సరం చెల్లించారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 15వ ఆర్థిక సంఘం కింద చేసిన పనులకు మాత్రం చెల్లింపులు జరగలేదు.



చలో అసెంబ్లీకి వెళ్లకుండా మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు(ఫైల్)

మూడేళ్లుగా ఇదే తంతు...

బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిలిచిపోయిన చెల్లింపులకు ఇప్పటికీ మోక్షం లభించడం లేదు. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 2, 2024తో ముగిసిపోయింది. వారు పదవిలో ఉన్న సమయంలో చేసిన పనులకు బిల్లులు లేకపోవడం, పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కాకపోవడంతో ఆర్థిక సంఘం నిధుల మంజూరును నిలిపేసింది. ఫలితంగా చెల్లింపులకు నిధుల కొరత తీవ్రమైంది. మాజీ సర్పంచ్‌లు అనేకమార్లు తమ గోడును ప్రభుత్వానికి విన్నవించడానికి ఛలో అసెంబ్లీ, సచివాలయం ముట్టడి కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఆ సందర్భాల్లో మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఉండటానికి ముందస్తు అరెస్టు చేసి ఆందోళన కార్యక్రమాలను అడ్డుకున్నారు. ప్రభుత్వం స్పందించి తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

చాలా ఆలస్యం చేశారు

మేము చేసిన పనులకు బిల్లులు చెల్లించే విషయంలో ప్రభుత్వం పెద్ద మనసు పెట్టి ఆలోచన చేయాలి. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. వెంటనే పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేయాలి.

– కదారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్, సుంకెట్

ధాన్యం ఆరబోసేందుకు రోడ్లే దిక్కు

- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నందిపేట్(ఆర్మూర్): ధాన్యం ఆరబోసేందుకు రోడ్లే దిక్కయ్యాయి. రైతు ప్రభుత్వాలని చెప్పుకోవడమే తప్ప రైతులకు ధాన్యం ఆరబెట్టేందుకు ప్లాట్‌ఫాంలను నిర్మించడం లేదు. దీంతో రైతులు గత్యంతరం లేక రోడ్లపై ధాన్యం ఎండబెడుతున్నారు. ఈ క్రమంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వడ్లకుప్పలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏ పంట దిగుబడి వచ్చినా ఆరబెట్టాలంటే తారురోడ్డు ఎక్కాల్సిందే. లేదంటే పంటలు ఎండడం గగనమవుతోంది.కుప్పలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనాలు కుప్పలను ఢీకొన్న ఘటనలో ప్రతి ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. అనేక మంది గాయాలపాలవుతున్నారు.

- గతేడాది విజయనగర్ గ్రామ సమీపంలో రాత్రి సమయంలో వరిధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో బైక్‌పై వస్తున్న నందిపేటకు చెందిన యువకుడు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. రెండు నెలలు చికిత్స పొంది చివరికి మృత్యువాత పడ్డాడు.
- రెండేళ్ల క్రితం నందిపేట మండల కేంద్రానికి సమీపంలో గల పలుగుగుట్ట ప్రాంతంలో వరి కుప్పలు ఢీకొన్న ఘటనలో మాక్లూర్ మండలానికి చెందిన ఇద్దరు యువకులలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

ముందు జాగ్రత్తలు ఎక్కడ?

రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, రవాణ శాఖాధికారులు సమన్వయంతో నియంత్రణకు చర్యలు చేపట్టాలని వాహనాదారులు, రైతులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్కడా కనపడటం లేదు.



రోడ్డుపైన ఆరబోసిన వరిధాన్యం

పత్తాలేని ప్లాట్ ఫామ్‌లు..

నూరు శాతం సబ్సిడీపై సిమెంట్ ప్లాట్ ఫామ్‌లను అందించాలని రైతులు నెలల తరబడి ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నా వాటికి పూర్తిస్థాయిలో మోక్షం లభించడం లేదు. గతంలో ఈజీఎస్ పథకం ద్వారా ప్లాట్ ఫామ్‌లను నిర్మించి ఇస్తామని ప్రభుత్వాలు ప్రకటించాయి. కాని ఇప్పటి వరకు ముందడుగు పడలేదు. అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు తీర్చాలని రైతులు కోరుకుంటున్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

■ శ్రీకృష్ణ యాదవ సంఘం..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జల్లెల్ల అనిల్, ఉపాధ్యక్షుడిగా నూకల మహేష్, కార్యదర్శిగా కోరె నిషాంత్, కోశాధికారిగా కోరె నర్సయ్యలను ఎన్నుకున్నారు. గొర్రెలు, మేకల సహకార సంఘం మండలాధ్యక్షుడు నూకల బుచ్చి మల్లయ్య పాల్గొన్నారు.



■ విశ్వబ్రాహ్మణ సంఘం..

వేల్పూర్: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీపాద శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా అంబిడి శ్రీనివాస్, కోశాధికారిగా అమృతాల నరసింహాచారి, సంయుక్త కార్యదర్శిగా వేల్పుల అన్వేష్, కార్యదర్శులుగా గజ్జల శ్యామ్, పూజారి అంబిడి రమేశ్‌లను ఎన్నుకున్నారు.



యువ వికాసం గడువు 14 వరకు..

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్, మ్యాన్‌వల్‌గా కూడా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 వీర ధీర శూరన్ పార్ట్-2(తెలుగు)-9.45, 1.05, 7.30, 10.50, కోర్ట్(తెలుగు)-4.25
- స్క్రీన్-2 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.25, రాబిన్‌హుడ్(తెలుగు)-1.10, 4.20, 7.30,10.40
- స్క్రీన్-3 ఎల్-2 ఎంపురాన్-10.00, 4.20, 10.40, మ్యాడ్ స్క్వేర్-1.35, 7.55
- స్క్రీన్-4 రాబిన్‌హుడ్(తెలుగు)-10.00, కోర్ట్-1.10 మ్యాడ్ స్క్వేర్-4.15, 10.35



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్

ఎల్‌ఆర్‌ఎస్‌లో ఆర్మూర్ మొదటి స్థానం

- మున్సిపాలిటీకి రూ.3.99 కోట్లు ఆదాయం
- 443 మందికి ప్రొసీడింగ్స్ అందజేత



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న అధికారులు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడం కోసం ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఇచ్చిన అవకాశాన్ని ఆర్మూర్ పట్టణంలో పలువురు సద్వినియోగం చేసుకున్నారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 4,135 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిన తర్వాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మరో 110 మంది కొత్తగా దరఖాస్తు చేశారు. మొత్తం 3,118 మందికి ఫీజు ఇంటిమేషన్ లెటర్లు పంపించగా, మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, వార్డ్ అధికారుల సహాయంతో దరఖాస్తుదారులకు కాల్ చేసి పథకం వివరాలను తెలియజేశారు. 699 మంది ముందుకు వచ్చి ఫీజు చెల్లించారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకంలో ఆర్మూర్ మున్సిపాలిటీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు 443 మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వగా, భూమి క్రమబద్ధీకరణలో మున్సిపల్‌కు రూ.3.99 కోట్ల ఆదాయం వచ్చింది.

మొదటి స్థానంలో ఉన్నందుకు..

ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి ఆర్మూర్ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. పథకంలో ఆర్మూర్ మున్సిపల్ జిల్లాలో మొదటిస్థానం నిలవడం సంతోషంగా ఉంది. మున్సిపల్‌కు ఫీజు రూపంలో రూ.3.99 కోట్లు సమకూరాయి.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

నువ్వుల పంట పండింది..!



నల్లూర్‌లో కోత కోస్తున్న రైతులు

బాల్కొండ: యాసంగి సీజన్‌లో సాగు చేసిన నువ్వుల పంట పండింది. ముప్కాల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు నువ్వు పంటను కోత కోస్తున్నారు. ముందుగా పసుపు తవ్వకాలు చేపట్టిన నేలల్లో నువ్వుల పంటను ఎక్కువగా సాగు చేశారు. పసుపు తవ్వకాలు జరుగుతుండగానే అదే నేలల్లో విత్తనాలు చల్లి పసుపును తవ్వారు. ప్రస్తుతం ఆ పంట చేతికి వచ్చింది. సజ్జ పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు నువ్వు పంటను సాగు చేశారు. ప్రస్తుతం ఆన్ సీజన్‌లో నువ్వులు క్వింటాల్‌కు రూ.16 వేలు పలుకుతోంది. పంట దిగుబడి వచ్చిన తరువాత మార్కెట్‌లో ధరను తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు.